క్లుప్తంగా

కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

ఎంఈఓ బి.రాజకుమారి

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కస్తూర్బా పాఠశాలలో అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యా శాఖ అధికారి బి.రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో 6, 11 తరగతులలో ప్రవేశాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా 7, 8, 9, 10, 12 తరగతులలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అచ్చంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరు, ఫస్ట్ ఇంటర్ తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ అధికారి జ్యోత్స్న బుధవారం తెలిపారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడిమానేసిన పిల్లలు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు http:// apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7075159996, 7075039990 నంబర్లలో సంప్రదించవలసినదిగా స్పెషల్ అధికారి కోరారు.

రేపు జాబ్ మేళా

సత్తెనపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 21న సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు బుధవారం తెలిపారు. ఈ జాబ్ మేళాను సత్తెనపల్లి పరిసర ప్రాంత యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాకు గోదావరి ఆంధ్రా కార్పొరేటివ్ సొసైటీ, ఫ్యూజన్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నికోమాక్, ఐటీసీ వంటి కంపెనీలు హాజరవుతాయన్నారు. విద్యార్హతను బట్టి జీతం ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు చదువుకున్న 18–38 మధ్య వయసు గల నిరుద్యోగ యువతీయువకులు బయోడేటా సర్టిఫికెట్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు రామకృష్ణ రెడ్డి–8074393466, అంజిరెడ్డి–9494986164 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఔత్సాహికులు ముందుగా https:// naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోగలరన్నారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి



బెల్లంకొండ: చెడు వ్యసనాలకు యువత అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని బెల్లంకొండ ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. యువత సన్మార్గంలో నడవాలని, భవిష్యత్తుకు అందమైన బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు వాల్ పోస్టర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మల్లికార్జునరావు, ఎల్.వెంకటేశ్వరరావు, శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం సహకరించాలి

ఎస్ఐ గిరిబాబు



పెదకూరపాడు : గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు కోరారు. పెదకూరపాడు మండల వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆటోలు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గిరిబాబు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసలై యువత అనారోగ్యం పాలవుతున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన లేని సచివాలయాలు

- గ్రామ సచివాలయాల్లో స్పందనకు చెల్లు చీటి
- గత్యంతరం లేక మండల కేంద్రానికి వెళ్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



నెమలికల్లు సచివాలయం

అమరావతి: ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలతో ముడిపడి ఉన్న వ్యక్తిగత, గ్రామ స్థాయి సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రజలు మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో వెళ్లాల్సిన అవసరం లేకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలలో ప్రతి రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించేది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితోపాటు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వినతులు స్వీకరించి తమ స్థాయిలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేవారు. గ్రామ సచివాలయాలలో స్పందన నిర్వహించటం వల్ల ప్రజలకు ప్రయాణభారం, రవాణా చార్జీలు, సమయం వృథా కాకుండా సమస్యలు పరిష్కారమయ్యేవి. మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయేది.

స్పందనకు స్వస్తి పలికిన కూటమి

కూటమి ప్రభుత్వం వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. దీంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సచివాలయాల్లో ఎక్కడా ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న దాఖలాలు లేవు. గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించకపోవడంతో ప్రజలు మండల, జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమానికి (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దానిని కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని పేరు మార్చి కేవలం మండల, జిల్లా కేంద్రాల్లోనే అది కూడా వారంలో కేవలం సోమవారం మాత్రమే నిర్వహిస్తుండడంతో అర్జీదారులు పనులు మానుకుని వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు

గ్రామాల్లో స్పందన కార్యక్రమం లేకపోవడంతో మండల కేంద్రం, జిల్లా కేంద్రానికి వెళ్లలేక కొందరు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళల పరిస్థితి కష్టంగా మారింది. ఇంట్లో పనులు చేసుకుని వెళ్లే తీరిక లేక సమస్యల మధ్యే సతమతమవుతున్నారు. మరో వైపు వేసవి కావడంతో ఎండకు వెళ్లలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు గ్రామాల్లోని సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి.

నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాల సంఖ్య
పెదకూరపాడు	14
అమరావతి	16
అచ్చంపేట	17
క్రోసూరు	15
బెల్లంకొండ	10

మండల కేంద్రంలో సమర్పించవచ్చు

గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదు. కేవలం మండల కేంద్రంలో సోమవారం మాత్రమే నిర్వహిస్తున్నారు. అర్జీదారులు ఎవరైనా సోమవారం మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలో అర్జీలను సమర్పించవచ్చు.

– టి.పార్వతి, ఎంపీడీఓ, అమరావతి

గ్రామ స్థాయిలో పరిష్కరించాలి



ప్రజా సమస్యలను, ప్రత్యేకంగా మహిళలు, వృద్ధుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించాలి. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే కార్యక్రమానికి రావాలంటే వ్యయప్రయాసలకోర్చి రావాల్సివస్తుంది. ప్రజకు ఇబ్బంది కలగకుండా గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

– ఆలపాటి వీరయ్య, ధరణికోట, అమరావతి మండలం

నేడు నరసరావుపేటలో విద్యుత్ అదాలత్

సత్తెనపల్లి: నరసరావుపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ అదాలత్ జరుగుతుందని సత్తెనపల్లి ఏడీఈ రాజశేఖర్‌బాబు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు విద్యుత్ అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వినియోగదారులు లిఖిత పూర్వకంగా అదాలత్ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అచ్చంపేట: ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నేడు గురువారం 20న నరసరావుపేటలోని డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏఈ శివకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదవకాశాన్ని మండలంలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా ఏఈ శివకోటిరెడ్డి కోరారు.

ముప్పాళ్ళ: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 20న నరసరావుపేటలోని బరంపేటలో గల డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సుచరిత బుధవారం చెప్పారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలను సత్వరం పరిష్కరించటం జరుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల వద్ద మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలి



ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు మెడికల్ కిట్స్ అందజేస్తున్న ఎంపీడీవో, వైద్యాధికారి

అచ్చంపేట: ఉపాధి పనులు జరిగే ప్రదేశాలలో తప్పనిసరిగా కూలీలకు మెడికల్ కిట్స్, మంచి నీళ్లు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్స్‌ను మండల వైద్యాధికారి ఇన్నారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. డ్వామా పీడీ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు మెరుగైన సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై ఉందన్నారు. ఈ సందర్భంగా మండలంలో 23 గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ ఇన్నారావు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే క్రమంలో ఎవరైనా కూలీలు సొమ్మసిల్లి పడిపోయినా, అసౌకర్యానికి గురైనా మెడికల్ కిట్స్ వినియోగించి ప్రథమ చికిత్స చేయాలన్నారు. ఉపశమనం కలుగకపోతే వెంటనే పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ పి.వెంకట్రావు, టెక్నికల్ అసిస్టెంట్స్ రాజవర్ధన్, శేషారావు, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వరిలో అగ్గి తెగులుకు సత్వర నివారణ చేపట్టాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



గోళ్ళపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఓ అరుణ

నకరికల్లు: బిర్రు పొట్ట దశలో వరిలో గింజ గట్టిపడేందుకు వరిలో రెండంగుళాల మందంలో నీరు తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ఆకులలో ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగు గల నూలు కండాకారపు మచ్చలు ఏర్పడి క్రమేపి ఒకదానికొకటి కలసి ఎండిపోయిన లక్షణాలతో అగ్గి తెగులు కన్పిస్తుందన్నారు. నివారణకు ట్రైసైక్లోజోల్ 75 శాతం మందును 0.6 గ్రాములు లేదా ఐసోప్రోపోతయోలిన్ 40 శాతం మందును 1.5 మిల్లీ లీటర్లు లేదా కాసుగామైసిన్ 2.5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తురకపాలెం సర్పంచ్ నాగోతు దాసయ్య, ఎంపీఓ కె.హనుమంతరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటలను మద్దతు ధరకే అమ్ముకోవాలి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రైతులు పంట ఉత్పత్తులను మద్దతు ధరకే అమ్ముకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. రైతులు పంట దిగుబడులకు మార్కెట్‌లో కన్నా తక్కువ లభిస్తుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలన్నారు. శనగలు క్వింటా రూ.5,750, మినుములు రూ.7,400, మొక్కజొన్న రూ.2,225, కంది రూ.7,550 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పంటలను అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న కోతలు ప్రారంభం కావటంతో దిగుబడులను పరిశీలించారు. ఏఈఓ డేవిడ్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రం తనిఖీ

అచ్చంపేట: స్థానిక బ్లూ బెల్స్ హైస్కూలులోని పది పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ జి.శ్రీనివాస యాదవ్ తనిఖీ చేశారు. బుధవారం జరిగిన హిందీ పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరు కావాలి, ఎంతమంది హాజరయ్యారు, పరీక్షలు ఎలా జరుగుతున్నాయి.. విద్యార్థులకు కావలసిన వసతులు అన్నీ ఉన్నాయా.. లేవా, అనే విషయాలను ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ఆన్సర్ పేపర్స్ బండిల్స్ కట్టి పంపే వరకు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కాగా ఈ పరీక్ష కేంద్రం ఈ ఏడాది కొత్తగా మంజూరైంది.

ఆరుగురు గైర్హాజరు: ఎంఈవో

స్థానిక పది పరీక్ష కేంద్రాలలో బుధవారం జరిగిన హిందీ పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ఏకుల ప్రసాదరావు తెలిపారు. స్థానిక జడ్పీహెచ్ స్కూలులో 183 మంది విద్యార్థులకు గాను 182 మంది, ఏపీ సాంఘిక సంక్షేమ గురుగుల పాఠశాలలో 182 మందికి గాను 180 మంది, బ్లూ బెల్స్ హైస్కూలులో 140 మందికి గాను 137 మంది హాజరైనట్లు ఎంఈవో చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

క్రోసూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 902 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారని ఎంఈవో గణేష్ తెలిపారు. రెండు టీముల స్పెషల్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసారని ఎంఈవో చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



మాదల(ముప్పాళ్ళ): ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడుకి తీవ్ర గాయాల పాలైన ఘటన మండలంలోని మాదల సమీపంలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లికి చెందిన షేక్ జానీబాషా ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి నుంచి ముప్పాళ్ళ వైపు వస్తూ సత్తెనపల్లి–నరసరావుపేట రోడ్డులో మాదల సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జానీబాషా తలకు తీవ్ర గాయం కావటంతో చికిత్స నిమిత్తం ఆటోలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ సభలు

మాచవరం: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి రికార్డులను అందజేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో మొత్తం రూ.4,75,52,00,94లకు గానూ తనిఖీలు జరుగుతాయన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించి, ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు.

యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడవద్దు



పోస్టర్లు ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు, సీఐలు, ఎస్ఐలు



తాలూకా సెంటర్‌లో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్ఆర్ఐ విద్యార్థులు, పోలీసులు

సత్తెనపల్లి: యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడకుండా దూరంగా ఉండాలి అని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై యువతకు అవగాహన కల్పిస్తూ పట్టణంలోని కార్యాలయం వద్ద బుధవారం 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లు ఆవిష్కరించి ప్రదర్శించారు. అనంతరం ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి తాలూకా సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యం చేస్తూ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై పూర్తి స్థాయిలో యువతకు అవగాహన ఉండాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం జరుగుతుంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలన్నారు. యువత వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగాన్ని దాచి పెట్టవద్దన్నారు. అనంతరం యువత ఆలోచింప చేసే విధంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ బ్రహ్మయ్య, సత్తెనపల్లి రూరల్ సీఐలు సుబ్బారావు, శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అమీనుద్దీన్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ టవర్‌లో గ్యాస్ సిలెండర్ లీక్

సకాలంలో మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది

పిడుగురాళ్ల: గ్యాస్ సిలెండర్‌లో గ్యాస్ లీకేజై ఒక్కసారిగా మంటలు రేగిన ఘటన పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లోని బాలాజీ టవర్స్‌లో డి.సాంబశివరావుకు చెందిన ప్లాట్‌నెంబర్ 201లో జరిగింది. సంఘటనకు సంబంధించి పిడుగురాళ్ల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... సాంబశివరావుకు చెందిన అపార్టుమెంట్‌లో మహిళలు పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీక్ అయి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న తాము వెంటనే అపార్టుమెంట్ వద్దకు చేరుకొని సిలెండర్ నుంచి వస్తున్న మంటలను అదుపు చేశామన్నారు. ప్రమాదంలో సుమారు రూ. 15 వేల ఆస్తినష్ట జరిగిందన్నారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.




పెదకూరపాడు రైల్వే స్టేషన్ రహదారి కోతకు గురై ప్రమాదంగా ఉన్న దృశ్యం

ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదమే..!

పెదకూరపాడు: నిత్యం వాహనాలతో... జెడ్పీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో ... రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉండే పెదకూరపాడు రైల్వే స్టేషన్ రోడ్డు చిన్న బ్రిడ్జి వద్ద కోతకు గురైంది. దీంతో రాత్రి సమయంలో వాహనాలు ఎదురు వచ్చే సమయంలో ప్రమాదం పొంచి ఉంది. రహదారి బ్రిడ్జి పక్కనే కోతకు గురైంది. మరమ్మతులు చేయక పోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. కోతకు గురైన రోడ్డు పక్కన పడితే పక్కన ఉన్న కాలువలో పడే ప్రమాదం ఉంది.

సంఘ ఆరాధనకు హాజరుకావాలని ఆహ్వానం



కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి కార్యవర్గం

సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో జరిగే సంఘ ఆరాధనకు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌ను బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి కార్యవర్గం బుధవారం ఆహ్వానించింది. సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల ఎస్.ఆనంద్ కుమార్ బాధ్యతలు స్వీకరించటంతో బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి కార్యవర్గం బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవ.జె.ఇశ్రాయేలు, సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి సైకిలాబ్, ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి చంద్రకాంత్, కార్యదర్శి కె.ఎం.అనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్ బాబు, కోశాధికారి గుజ్జర్లపూడి రవిరాజు, కమిటీ సభ్యులు గంగవరపు పెద్దప్రసాద్, రాచపూడి జయపాల్, గర్నెపూడి ఫ్రాన్సిస్, దంతం కుమార్ తదితరులు ఉన్నారు.

ఫాతిమాబేగం కుటుంబానికి అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



ఫాతిమాబేగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, భవనం రాఘవరెడ్డి

నకరికల్లు: అంగన్‌వాడీ కార్యకర్త ఫాతిమాబేగం కుటుంబానికి అండగా ఉంటామని సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి భరోసానిచ్చారు. ఒత్తిళ్లను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని పాపిశెట్టిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త దూదేకుల ఫాతిమాబేగం దశదిన కర్మ కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఫాతిమాబేగం చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, ఫాతిమాబేగం పిల్లలతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, దూదేకుల బాషా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నామినేషన్ల స్క్రూటీ్ని పూర్తి

సత్తెనపల్లి: సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి జరగాల్సిన ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్క్రూటీ్ని ప్రక్రియ బుధవారం ముగిసింది. 10 పదవులకు .. 14 నామినేషన్లు దాఖలు కాగా నామినేషన్లను పూర్తి స్థాయిలో ఎన్నికల అధికారులు పరిశీలించారు. ప్రధానంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, సబ్ కోర్టు సెక్రటరీ పదవులకు పోటీ నెలకొంది. మిగిలిన జాయింట్ సెక్రటరీ పదవికి గుజ్జర్లపూడి సురేష్ బాబు, ట్రెజరర్– బుర్రి సైదయ్య, జూనియర్ ఎగ్జిక్యూటివ్– తవ్వ హరనాథ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్– నిమ్మకాయల నాగులు, లైబ్రేరియన్– ఉల్లం మధు బాబు, మహిళా ప్రతినిధి– మహంకాళి కోటేశ్వరమ్మ ఒక్కొక్క నామినేషన్ వేసినందున వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్.ఆంజనేయులు ప్రకటించారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ, 21న అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామని తెలిపారు.